ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి: 20 సంచిక : 211 మంగళవారం 21, ఏప్రిల్ 2026 పేజీలు: 04 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com



# పిల్లి శాపాలకు ఉట్లు తెగుతాయా..?

**తెలంగాణాలో గతంలో భయంకర పరిస్థితులు ఉండేవి**

**తెలంగాణ పదం అసెంబ్లీలో మాట్లాడవద్దని రూలింగ్ ఇచ్చారు..**

**మిషన్ భగీరథ ఎందుకు కుంటుతుంది... లాగులు పగిలేలా కొట్టాలి**

**కేసీఆర్ సావాలి అంటున్నారు.. నేను సావను..**

**బీఆర్ఎస్ కేవలం 1.7శాతం తేడాతో ఓడింది...**

**రియల్ ఎస్టేట్ పడిపోయింది**

**రైతులకి ఇస్తామన్న బోనస్ బోగస్ అయింది : కేసీఆర్**

**జగిత్యాల, (ప్రజాస్వరం):** జగిత్యాల వేదికగా జరిగిన బహిరంగ సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. తన మరణం కోరుకుంటున్న వారికి తనదైన శైలిలో సమాధానమిస్తూనే, రాష్ట్రంలో ప్రస్తుత పాలనలోని వైఫల్యాలను ఎండగట్టారు. తెలంగాణ ఉద్యమ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ.. "ఒకప్పుడు అసెంబ్లీలో తెలంగాణ అనే పదం వాడటానికే వీల్లేకుండా రూలింగ్ ఇచ్చేవారు. బషీర్ బాగ్ కాల్పుల్లో రైతులు చనిపోయినప్పుడు భరించలేక పార్టీ పెట్టి బయలుదేరాను. కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అని చావు నోట్లోకి వెళ్లి రాష్ట్రాన్ని సాధించాను" అని కేసీఆర్ భావోద్వేగంగా మాట్లాడారు. ఇప్పుడు కొందరు కేసీఆర్ చావాలని కోరుకుంటున్నారని, కానీ పిల్లి శాపాలకు ఉట్లు తెగవని, తాను ఇప్పుడప్పుడే చావనని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ సంక్షోభంపై కేసీఆర్ ఘాటుగా స్పందించారు. "మేము అధికారంలో ఉన్నప్పుడు కరెంటు సక్కగా ఉండేది. ఇప్పుడు కరెంటుకు ఏ రోగం వచ్చింది? ఏమైనా కాకి ఎత్తుకపోయిందా?" అని ప్రశ్నించారు. 20 వేల మెగావాట్ల విద్యుత్ ..మిగతా 2లో




## రాష్ట్ర పునర్నిర్మాణం కేసీఆర్‌తోనే సాధ్యం

**అభివృద్ధికి రాజకీయాలు లేవు**

**10 జిల్లాల తెలంగాణ రాష్ట్రాన్ని 23 జిల్లాలుగా చేసిన ఘనత కేసీఆర్‌దే**

**రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కూడా కేసీఆర్‌దే**

**కేసీఆర్ జగిత్యాలకు వస్తే.. అప్పుడే నిద్రలేచినట్టు రేవంత్ రెడ్డి నటిస్తున్నారు. - జీవన్ రెడ్డి**



2

# గచ్చిబౌలిలో అగ్నిప్రమాదం..

**సెల్లార్‌లో షార్ట్ సర్క్యూట్‌తో 15 ద్విచక్ర వాహనాలు పూర్తిగా దగ్ధం**



**గచ్చిబౌలిలో అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో అగ్నిప్రమాదం**

**ఎలక్ట్రికల్ ప్యానెల్ బోర్డులో షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు ప్రారంభం**

**అపార్ట్‌మెంట్ అంతా దట్టమైన పొగ**

**పొగ పీల్చడంతో ఇద్దరు నివాసితులకు అస్వస్థత..**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):** హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న టిఎన్జీవో కాలనీలో సోమవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఒక అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదంలో భారీగా ..మిగతా 2లో

# కేసీఆర్ పగటి కలలు మానుకోవాలి..

**బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు**

**ప్రత్యేకంగా కే. చంద్రశేఖర్ రావు కుటుంబంపై ఆరోపణలు**

**ప్రాజెక్టుల రీ-డిజైన్ పేరుతో అవినీతి జరిగిందని వ్యాఖ్య**

**ప్రాజెక్టుల పేర్లు, స్థలాలు మార్చినట్టు ఆరోపణ**

**కమీషన్ల కోసమే మార్పులు చేశారన్న విమర్శ**

**ఆర్థిక లాభాల కోసం "డ్రామా" ఆడారన్న అభిప్రాయం**

**కాంగ్రెస్ ప్రాజెక్టులకు గుర్తింపు రాకూడదని ఆరోపణ**

**కాళేశ్వరం కేసీఆర్ అవినీతికి సాక్ష్యం..**

**బీఆర్ఎస్ ప్రభుత్వం మార్పులు చేసిందన్న విమర్శ**



**మేడిగడ్డ, (ప్రజాస్వరం):** తెలంగాణ రాజకీయాల్లో మాటల యుద్ధం ముదిరి పాకాన పడింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన విమర్శలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత తీవ్రంగా స్పందించారు. కేసీఆర్ మళ్ళీ అధికారంలోకి వస్తానని భ్రమపడుతున్నారని, కానీ తెలంగాణలో ఆ కుటుంబం శకం శాశ్వతంగా ముగిసిపోయిందని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.

గత పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన అవినీతి, అరాచక పాలనను ప్రజలు మర్చిపోలేదని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని ఎలాగైతే తిరస్కరించారో, 2029 ఎన్నికల్లోనూ అదే ఫలితం పునరావృతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. గతంలో వైఎస్ఆర్ – డి.శ్రీనివాస్ జోడీ కాంగ్రెస్‌ను వరుసగా ఎలా గెలిపించిందో, ఇప్పుడు తాను – పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కలిసి రెండోసారి కాంగ్రెస్‌ను విజయతీరాలకు చేరుస్తామని ఆయన శపథం చేశారు.ప్రజాస్వామ్యంలో ప్రజలే సుప్రీం అని, వారిచ్చిన తీర్పును గౌరవించకుండా కేసీఆర్ ఇంకా అహంకారంతో మాట్లాడటం ఆయన భ్రమలకు నిదర్శనమని రేవంత్ మండిపడ్డారు. కేసీఆర్ వ్యాఖ్యలు 'చిల్లర మాటలు' అంటూ కొట్టిపారేసిన సీఎం, రాష్ట్ర ప్రజలు కల్వకుంట్ల కుటుంబాన్ని ఎప్పటికీ క్షమించరని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే తమను మళ్లీ గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి కాలం చెల్లిందని, ఇకపై తెలంగాణ గడ్డపై కాంగ్రెస్ హవా మాత్రమే కొనసాగుతుందని రేవంత్ రెడ్డి కార్యకర్తల సాక్షిగా ప్రకటించారు. విపక్షాల విమర్శలకు తాము ..మిగతా 2లో

# కేసీఆర్ సభకు హరీశ్ రావు గైర్హాజరు..

**చాలా రోజుల తర్వాత జగిత్యాలలో కేసీఆర్ బహిరంగ సభ**

**ఈ కీలక సభకు దూరంగా హరీశ్ రావు.. హుటాహుటిన ఢిల్లీకి**

**కాళేశ్వరం కమిషన్‌పై హైకోర్టు తీర్పు నేపథ్యంలో న్యాయసలహా కోసం పయనం**

**ఎమ్మెల్యేల ఫిరాయింపులపైనా న్యాయపరమైన కార్యాచరణకు సన్నాహాలు**

**హరీశ్‌తో పాటు వినోద్ కుమార్, వద్దిరాజు రవిచంద్ర కూడా ఢిల్లీకి**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):** చాలా రోజుల విరామం తర్వాత బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మళ్లీ ప్రజల్లోకి వస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత తొలిసారిగా ఆయన ఇవాళ జగిత్యాలలో నిర్వహించనున్న 'బీఆర్ఎస్ ఆశీర్వాద సభ'లో పాల్గొని ప్రసంగించనున్నారు. ఇందుకోసం సాయంత్రం ఎర్రవల్లి ఫాంహౌస్ నుంచి ఆయన బయలుదేరనున్నారు. అయితే, పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఈ సభకు కీలక నేత, మాజీ మంత్రి హరీశ్ రావు గైర్హాజరు కావడం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ..మిగతా 2లో



## అంధకారంలో హరీశ్ రావు రాజకీయ భవిష్యత్తు

**హరీశ్ రావు మానసిక వేదనతో బాధపడుతున్నారన్న తుమ్మల**

**జరుగుతున్న అవమానాలవల్లే ఆయన స్థితి ఇలా తయారైందని వ్యాఖ్య**

**బీఆర్ఎస్ నేతలకు అధికారం పోయినా అహంకారం తగ్గలేదని విమర్శ**



2

www.prajaswaramdaily.com WWW.PRAJASWARAMDAILY.COM

# గచ్చిబౌలిలో అగ్నిప్రమాదం..

**మొదటిపేజీ తరువాయి**

ఆస్తి నష్టం సంభవించినప్పటికీ, ప్రాణనష్టం తప్పింది.ప్రాథమిక సమాచారం ప్రకారం, అపార్ట్‌మెంట్ సెల్లార్ లోని ఎలక్ట్రికల్ ప్యానెల్ బోర్డులో షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు మొదలయ్యాయి. సెల్లార్‌లో పార్క్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాలకు ఈ మంటలు వేగంగా అంటుకున్నాయి. నిమిషాల వ్యవధి లోనే అపార్ట్మెంట్ అంతా దట్టమైన నల్లటి పొగ కమ్మేసింది. పొగ కారణంగా పై అంతస్తుల్లో ఉన్న నివాసితులు ఊపిరి ఆడక ఉక్కిరి బిక్కిరి అయ్యారు.

ఈ అగ్నిప్రమాద ఘటనలో సెల్లార్ లో పార్క్ చేసిన సుమారు 15 ద్విచక్ర వాహనాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. పొగ పీల్చడం వల్ల అపార్ట్మెంట్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు సమాచారం. సమాచారం అందిన వెంటనే గచ్చిబౌలి ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అపార్ట్మెంట్ లోపల చిక్కుకున్న వారిని అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. నిచ్చెనల సాయంతో పై అంతస్తుల నుంచి బాధితులను సురక్షితంగా కిందకు దించారు. అగ్నిమాపక యంత్రాలతో నీటిని చల్లి మంటలు ఇతర ఇళ్లకు వ్యాపించకుండా అదుపు చేశారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అటు అపార్ట్‌మెంట్ వాసులు, ఇటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం పోలీసులు ఆస్తి నష్టంపై అంచనా వేస్తున్నారు.



# పిల్లి శాపాలకు ఉట్లు తెగుతాయా..?

**మొదటిపేజీ తరువాయి**

సామర్థ్యం ఉన్న రాష్ట్రాన్ని ఈ 'దరిద్రుల' చేతిలో పెడితే.. నేడు ప్రజలు చీకట్లో మగ్గుతున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో తాను హెచ్చరించినట్లే జరుగుతోందని కేసీఆర్ అన్నారు. "వీళ్లు గెలిస్తే దళిత బంధుకి జైభీమ్, రైతుబంధుకి రాం రాం అని చెబుతారని ముందే చెప్పాను ఇప్పుడు అదే జరుగుతోంది. రైతుబంధు డబ్బులు నెలల తరబడి వేస్తారా? రైతుల కష్టాలు వీళ్లకు పట్టడం లేదు" అని మండిపడ్డారు. ఇంటింటికి మంచినీళ్లు ఇచ్చే మిషన్ భగీరథ పథకాన్ని ఎందుకు కుంటుపడేలా చేస్తున్నారని కేసీఆర్ ప్రశ్నించారు. ప్రజలకు నీళ్లు ఇవ్వడంలో విఫలమైతే.. "లాగులు పగిలేలా కొట్టాలి" అంటూ తనదైన శైలిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సాధించిన కేసీఆర్ ఉన్నంత వరకు ప్రజల పక్షాన పోరాటం ఆగదని, కాంగ్రెస్ వైఫల్యాలను నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు అన్నీ కోల్పోయామని బాధపడుతున్నారని, తెలంగాణ పునర్నిర్మాణం కోసం మరోసారి పోరాడాల్సిన సమయం వచ్చిందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునిచ్చారు. జగిత్యాల బహిరంగ సభలో ఆయన ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ పార్టీ కేవలం 1.7 శాతం ఓట్ల తేడాతోనే ఓడిపోయిందని కేసీఆర్ గుర్తు చేశారు. "కొత్త ప్రభుత్వం వచ్చింది కదా, ఏదైనా చేస్తారని ఇన్నాళ్లూ మౌనంగా ఉన్నాను. కానీ, వీళ్లు ఒక్కటంటే ఒక్కటైనా నిర్మాణాత్మకమైన పని చేశారా?" అని ప్రశ్నించారు. ప్రజలు ఆశపడి ఓటేస్తే, కాంగ్రెస్ వారిని నిలువునా మోసం చేసిందని మండిపడ్డారు.

రైతుల పరిస్థితి రాష్ట్రంలో దారుణంగా మారిందని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. "దుకాణాల్లో యూరియా లేదు కానీ యాప్‌లో వస్తుందట. యూరియా కోసం రైతులు చెప్పులు లైన్లో పెడుతున్నారు. రైతుబంధు రావాలంటే కేసీఆర్ సభ పెట్టాలా? రైతులకు ఇస్తామన్న బోనస్ కాస్త 'బోగస్' అయింది. మొక్కజొన్న కొనుగోలు చేసే దిక్కు లేదు" అని ధ్వజమెత్తారు. వ్యవసాయ బావులకు మీటర్లు పెట్టే విషయంలో ప్రభుత్వం ఇప్పటికే సంతకాలు చేసిందని ఆయన ఆరోపించారు.

హైడ్రా (HYDRAA) పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తున్న తీరుపై కేసీఆర్ తీవ్రంగా స్పందించారు. "ఏమిటి ఈ కూల్చివేతలు? కనీసం పిల్లల పుస్తకాలు కూడా తీసుకోవనివ్వరా? మేము అధికారంలోకి రాగానే మొట్టమొదట హైడ్రాను పీకి పారేసే ఫైలు మీదనే సంతకం చేస్తాను" అని హామీ ఇచ్చారు. పీసీసీ అధ్యక్షుడు నిజామాబాద్ పోయి 'నిద్రా' తెస్తానంటున్నారని ఎద్దేవా చేశారు.

రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా పడిపోయిందని, చేనేత కార్మికుల ఆత్మహత్యలు మళ్లీ మొదలయ్యాయని కేసీఆర్ ఆందోళన వ్యక్తం




చేశారు. "మేము ఉద్యోగులకు 72 శాతం పీఆర్సీ ఇచ్చాము, కానీ వీళ్లు 7 శాతం కూడా ఇవ్వలేకపోతున్నారు. ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు 12 వేల కోట్లకు చేరాయి. గ్రామ పంచాయతీ ట్రాక్టర్లకు డీజిల్ పోయించే తెలివి కూడా ఈ ప్రభుత్వానికి లేదు" అని విమర్శించారు.తెలంగాణ సమాజం ఇప్పుడు ఒక గందరగోళంలో ఉందని, ప్రజల పక్షాన నిలబడి ఈ 'దరిద్రపు పాలన'పై పోరాడుతామని కేసీఆర్ స్పష్టం చేశారు.

# పెద్దవీడులో బోరు ఏర్పాటు.. గ్రామానికి తాగునీటి ఊరట

- **సర్పంచ్ రాజ సులోచన ఆధ్వర్యంలో అమెజాన్ సంస్థ సహకారం**

**షాబాద్, ఏప్రిల్ 20(ప్రజాస్వరం):**

షాబాద్ మండలంలోని పెద్దవీడు గ్రామ పంచాయతీ పరిధిలో నీటి సమస్యను పరిష్కరించేందుకు సర్పంచ్ రాజ సులోచన ఆధ్వర్యంలో అమెజాన్ సంస్థ సహకారంతో బోరు ఏర్పాటు పనులు చేపట్టారు. గ్రామస్తులకు అవసరమైన తాగునీటి సదుపాయం కల్పించేందుకు తీసుకున్న ఈ చర్యలను గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ సందర్భంగా సర్పంచ్ రాజ సులోచన మాట్లాడుతూ గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అమెజాన్ సంస్థ సహకారంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవేందర్ రెడ్డి, డిప్యూటీ సర్పంచ్ రవీందర్ నాయక్, వార్డు సభ్యులు పవన్, ప్రవీణ్, నరేష్, గ్రామస్తులు అశోక్, రాజు, బాలరాజు, రవీందర్ రెడ్డి, నరసింహారెడ్డి, జగదీష్, కృష్ణయ్య, అమెజాన్ ప్రతినిధి సుధాకర్, గ్రామ పెద్దలు, అంగన్వాడీ సిబ్బంది, మహిళలు, యువకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కేసీఆర్ సభకు హరీశ్ రావు గైర్హాజరు..

**మొదటిపేజీ తరువాయి**

తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

పార్టీ ముఖ్య నేతలంతా జగిత్యాల సభ ఏర్పాట్లలో నిమగ్నమై ఉండగా, హరీశ్ రావు మాత్రం పార్టీ నేతలు బి. వినోద్ కుమార్, వద్దిరాజు రవిచంద్రతో కలిసి హుటాహుటిన ఢిల్లీకి పయనమయ్యారు. కేసీఆర్ సభ జరుగుతున్న రోజే ఈ కీలక నేతలు ఢిల్లీకి వెళ్లడం వెనుక బలమైన కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా రెండు కీలకమైన న్యాయపరమైన అంశాలపై సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులతో చర్చించేందుకే ఈ పర్యటన చేపట్టినట్లు పార్టీ వర్గాల సమాచారం.

కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను సవాల్ చేస్తూ బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై విచారణ పూర్తిచేసిన ధర్మాసనం, ఈ నెల 22న తుది తీర్పును వెలువరించనుంది. ఒకవేళ తీర్పు ప్రతికూలంగా వస్తే వెంటనే సుప్రీంకోర్టులో సవాల్ చేసేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగానే ముందస్తుగా న్యాయవాదులతో మంతనాలు జరిపేందుకు హరీశ్ రావు బృందం ఢిల్లీకి వెళ్లినట్లు తెలుస్తోంది.



దీంతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసులో స్పీకర్ తీర్పు అనంతరం చేపట్టాల్సిన న్యాయపరమైన కార్యాచరణపై కూడా ఈ పర్యటనలో చర్చిస్తున్నట్లు సమాచారం. ఓవైపు కేసీఆర్ బహిరంగ సభ ద్వారా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేస్తుండగా, మరోవైపు కీలక నేతలు న్యాయపోరాటాలకు సిద్ధం కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. జగిత్యాల సభను విజయవంతం చేసేందుకు కేటీఆర్‌తో పాటు ఇతర ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు భారీగా జన సమీకరణ చేపట్టారు.

# రీ-డిజైన్ పేరుతో భారీ దోపిడీ..

**మొదటిపేజీ తరువాయి**

జరిగిన ప్రచారాన్ని ఎద్దేవా చేస్తూ సీఎం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "కాళేశ్వరం ప్రపంచంలోనే అద్భుతమని ప్రచారం చేసుకున్నారు. రాజకీయ లబ్ధి పొందేందుకు అప్పటి గవర్నర్ నరసింహన్‌తో హరీష్ రావు పేరును మార్చి 'కాళేశ్వర్ రావు' అని చెప్పించారు" అంటూ దుయ్యబట్టారు. ప్రాజెక్టు గొప్పతనం కంటే వ్యక్తిగత ఇమేజ్ కోసమే అప్పట్లో ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. కేసీఆర్ చేసిన అవినీతిని కాలమే గుర్తించిందని, అందుకే 2023 ఎన్నికల ముందే మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని సీఎం పేర్కొన్నారు. "కేసీఆర్ పాపాలను ప్రకృతే బయటకు తీసింది. ప్రపంచ అద్భుతం అని చెప్పిన ప్రాజెక్టు గాలిలో కలిసిపోయింది" అని అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు అన్ని కోణాల్లోనూ విఫలమైందని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (NDSA) తన నివేదికలో స్పష్టంగా పేర్కొందని సీఎం వెల్లడించారు. ప్రాజెక్టు నిర్మాణం, నాణ్యత, ప్లానింగ్.. ఇలా ప్రతి విషయంలోనూ వైఫల్యాలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ఈ పర్యటనలో ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన సీఎం, దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని మరోసారి స్పష్టం చేశారు. ఈ పర్యటనలో మంత్రులు, ఉన్నతాధికారులు , భారీ సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.




# అంధకారంలో హరీశ్ రావు రాజకీయ భవిష్యత్తు

- **హరీశ్ రావు మానసిక వేదనతో బాధపడుతున్నారన్న తుమ్మల**
- **జరుగుతున్న అవమానాలవల్లే ఆయన స్థితి ఇలా తయారైందని వ్యాఖ్య**
- **బీఆర్ఎస్ నేతలకు అధికారం పోయినా అహంకారం తగ్గలేదని విమర్శ**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

బీఆర్ఎస్ అగ్రనేత హరీశ్ రావుపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిప్పులు చెరిగారు. గత పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ నేతలు వ్యవస్థలను దోచుకుని రాష్ట్రాన్ని రావణకాష్ఠంగా మార్చారని ఆరోపించారు. హరీశ్ రావు రాజకీయ భవిష్యత్తు అంధకారంలో ఉందని, అందుకే ఏం చేయాలో దిక్కుతోచక పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. "హరీశ్ రావు ప్రస్తుతం మానసిక వేదనతో బాధపడుతున్నారు. గతంలో ఆయనకు జరిగిన, ప్రస్తుతం జరుగుతున్న అవమానాల వల్లే ఆయన స్థితి ఇలా తయారైంది" అంటూ తుమ్మల వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఎక్కడికి వెళ్లినా ఒకే ఆవు కథ, ఒకే రికార్డింగ్ క్యాసెట్ వినిపించడం హరీశ్



రావుకు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు.

సీతారామ సాగర్ ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నేతలకు మాట్లాడే హక్కు లేదని తుమ్మల అన్నారు. ఈ ప్రాజెక్టు తన రాజకీయ ఆకాంక్ష అని, దీనిని పూర్తి చేయడమే తన జీవిత లక్ష్యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం కేంద్ర అనుమతులు లేకుండా రూ. 8 వేల కోట్లు ఖర్చు చేసిందని, కేవలం కమీషన్ల కోసమే లోపభూయిష్టమైన డిజైన్లతో పనులు చేపట్టారని ఆరోపించారు. హెడ్ వర్క్స్ లిఫ్ట్ కూడా పూర్తి చేయలేని స్థితిలో బీఆర్ఎస్ పాలన సాగిందని మండిపడ్డారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో వంద కోట్లు వెచ్చించి గోదావరి జలాలను వైరా రిజర్వాయర్‌కు తరలించామని, సత్తుపల్లి టన్నెల్ కోసం మరో రూ. 1,500 కోట్లు ఖర్చు చేస్తున్నామని మంత్రి వివరించారు. ప్రజలు బుద్ధి చెప్పి అధికారం నుంచి దూరం చేసినా బీఆర్ఎస్ నేతలకు ఇంకా అహంకారం తగ్గలేదని తుమ్మల ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కేసీఆర్ పగటి కలలు మానుకోవాలి..

**మొదటిపేజీ తరువాయి**

చేసే అభివృద్ధే సమాధానం చెబుతుందని, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన ఈ సవాల్ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. కేసీఆర్ పార్టీని మళ్లీ గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తుంటే, రేవంత్ రెడ్డి మాత్రం ఆ అవకాశమే ఇవ్వకూడదనే పట్టుదలతో ఉండటంతో రాబోయే రోజుల్లో ఈ పొలిటికల్ వార్ మరింత ముదిరేలా కనిపిస్తోంది.

కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై, ముఖ్యంగా కేసీఆర్ కుటుంబంపై విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో తెలంగాణలో భారీ అవినీతి జరిగిందని, కమీషన్ల కోసమే ప్రాజెక్టుల పేర్లు, స్థలాలు మార్చారని ఆయన ఆరోపించారు.

2009లోనే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారని సీఎం గుర్తు చేశారు. అయితే, కాంగ్రెస్ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులకు పేరు రాకూడదనే ఉద్దేశంతోనే కేసీఆర్ ప్రభుత్వం వాటి స్థలాలను, పేర్లను మార్చిందని మండిపడ్డారు. కేవలం ఆర్థిక లాభాలు, కమీషన్ల కోసమే ఈ రీడిజైన్ డ్రామా ఆడారని రేవంత్ రెడ్డి విమర్శించారు.

ప్రాజెక్టు నిర్మాణ సమయంలో జరిగిన ప్రచారాన్ని ఎద్దేవా చేస్తూ సీఎం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "కాళేశ్వరం ప్రపంచంలోనే అద్భుతమని ప్రచారం చేసుకున్నారు. రాజకీయ లబ్ధి పొందేందుకు అప్పటి గవర్నర్ నరసింహన్ తో హరీష్ రావు పేరును మార్చి 'కాళేశ్వర్ రావు' అని చెప్పించారు" అంటూ దుయ్యబట్టారు.



ప్రాజెక్టు గొప్పతనం కంటే వ్యక్తిగత ఇమేజ్ కోసమే అప్పట్లో ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు.

కేసీఆర్ చేసిన అవినీతిని కాలమే గుర్తించిందని, అందుకే 2023 ఎన్నికల ముందే మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని సీఎం పేర్కొన్నారు. "కేసీఆర్ పాపాలను ప్రకృతే బయటకు తీసింది. ప్రపంచ అద్భుతం అని చెప్పిన ప్రాజెక్టు గాలిలో కలిసిపోయింది" అని అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు అన్ని కోణాల్లోనూ విఫలమైందని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (NDSA) తన నివేదికలో స్పష్టంగా పేర్కొందని సీఎం వెల్లడించారు. ప్రాజెక్టు నిర్మాణం, నాణ్యత, ప్లానింగ్.. ఇలా ప్రతి విషయంలోనూ వైఫల్యాలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ఈ పర్యటనలో ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన సీఎం, దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని మరోసారి స్పష్టం చేశారు. ఈ పర్యటనలో మంత్రులు, ఉన్నతాధికారులు , భారీ సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

# రాష్ట్ర పునర్నిర్మాణం కేసీఆర్‌తోనే సాధ్యం


- **అభివృద్ధికి రాజకీయాలు లేవు**
- **10 జిల్లాల తెలంగాణ రాష్ట్రాన్ని 23 జిల్లాలుగా చేసిన ఘనత కేసీఆర్‌దే**
- **రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కూడా కేసీఆర్‌దే**
- **కేసీఆర్ జగిత్యాలకు వస్తే.. అప్పడే నిద్రలేచినట్టు రేవంత్ రెడ్డి నటిస్తున్నారు. -జీవన్ రెడ్డి**

**జగిత్యాల, (ప్రజాస్వరం):**

క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా ఇన్నేళ్లు కాంగ్రెస్ పార్టీలో కొనసాగానని తెలిపారు. కానీ 20 మాసాలు నా ఉసురుపోసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతకాలం ఈ మానసిక క్షోభ భరించాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ బలోపేతానికి నాలుగు దశబ్దాలు పోరాడితే చివరకు దక్కింది ఏంటి.. నా జీవితం చివరి దశలో ఈ మానసిక్ష క్షోభ ఏంటని భావోద్వేగానికి గురయ్యారు. ఈ సమయంలో కేసీఆర్ నాకు చెయ్యిందించి అండగా ఉన్నారని తెలిపారు.

జగిత్యాలలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. కేసీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. నా ప్రజా జీవితంలో ఇది ఒక మలుపుగా భావిస్తున్నానని రెడ్డి తెలిపారు. మీ అందరి అండదండలతో ఈ స్థాయికి ఎదిగానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చూపెట్టిన వివక్షతో బీఆర్ఎస్ పార్టీలో చేరానని స్పష్టం చేశారు. నేనేదో ఆశించి పార్టీ మారలేదని స్పష్టం చేశారు. నాలుగు దశాబ్దాల్లో ఎన్నో పదవులు చూశానని అన్నారు. రాష్ట్రానికి పట్టిన శని వీడాలని ఉద్దేశంతోనే పార్టీలో చేరానని చెప్పారు.

బీఆర్ఎస్ ఆవిర్భావ సందర్భంలోనే కేసీఆర్



తనను పార్టీలోకి ఆహ్వానించారని జీవన్ రెడ్డి తెలిపారు. కానీ క్రమశిక్ష కలిగిన వ్యక్తిగా కాంగ్రెస్‌లోనే కొనసాగానని పేర్కొన్నారు. ఉద్యమ రథసారథిగా కేసీఆర్ తెలంగాణ సాధించారని అన్నారు. అలాంటి వ్యక్తితో పనిచేసే అవకాశం తనకు వచ్చిందని తెలిపారు.

కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని జీవన్ రెడ్డి విమర్శించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కేసీఆర్ రైతుబంధు ప్రవేశపెట్టారని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఎగ్గొట్టిందని అన్నారు. కేసీఆర్ కల్యాణలక్ష్మీ పేరుతో రూ. లక్ష ఆర్థిక సాయం చేశారని తెలిపారు. అయితే కాంగ్రెస్ రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామన్నారని గుర్తుచేశారు. కానీ ఉన్న పథకాన్నే ఊడగొట్టే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయడం లేదని విమర్శించారు.

కేసీఆర్‌తో తనకు మంచి అనుబంధం ఉందని తెలిపారు. బోర్నపల్లి నిర్మాణానికి రూ.70 కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాను చేసిన ఘనత కేసీఆర్‌ది అని కొనియాడారు. కేసీఆర్ జగిత్యాలకు మెడికల్ కాలేజీ ఇచ్చారని తెలిపారు. వైద్య సేవలను విస్తరించారని పేర్కొన్నారు. గురుకుల ఆశ్రమ పాఠశాలలను ఏర్పాటు చేశారని చెప్పారు. గిరిజనులకు రిజర్వేషన్లను కూడా పెంచారని అన్నారు.

## చిన్నారుల విద్యా ప్రస్థానంలో ప్రీ స్కూల్ కీలకం..

- **కేవీ రెడ్డి నగర్ లో కిడ్స్ జీ స్కూల్ ప్రారంభించిన సాయిపేట శ్రీనివాస్..**

**ప్రజాస్వరం, మేడ్చల్ :**

చిన్నారుల విద్యా ప్రస్థానంలో ప్రీ స్కూల్ కీలక పాత్ర పోషిస్తోందని గుండ్లపోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కేవీ రెడ్డి నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన కిడ్స్ జీ ప్రీ స్కూల్ ను సాయిపేట శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులోనే పిల్లల మేధస్సు, భావోద్వేగాలు, సామాజిక నైపుణ్యాలు వేగంగా అభివృద్ధి చెందే సమయంలో ప్రీ స్కూల్ ద్వారా సరైన మార్గదర్శనం లభిస్తుందన్నారు. ప్రీ స్కూల్ విద్య పిల్లలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచి, పాఠశాల విద్యకు సులభంగా అలవాటు పడేలా చేసి పిల్లలలో సామర్థ్యం, ఆలోచనా శక్తి కూడా పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కేవీ రెడ్డి నగర్ కిడ్స్ జీ బ్రాంచ్ హెడ్స్ నాగ భవాని, హేమంత్ స్కూల్ సిబ్బంది సరస్వతీ, నేహా, విజయేందర్ రెడ్డి, అశోక్, ఆయమ్మ సునీత, నాయకులు దొడ్ల నాగరాజు, సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## మహిళా బిల్లుపై బీజేపీది డ్రామా

- **సీనియర్ కాంగ్రెస్ నేత పాండుగౌడ్ ధ్వజం**

**సికింద్రాబాద్, ఏప్రిల్ 20 (ప్రజా స్వరం):**



మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ద్వంద్వ నీతిని ప్రదర్శిస్తోందని సికింద్రాబాద్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ మహిళా బిల్లుకు వ్యతిరేకం కాదని, అయితే ప్రతిపక్షాల అనుమానాలను నివృత్తి చేయడంలో బీజేపీ పూర్తిగా విఫలమైందని ఆయన మండిపడ్డారు. 2023 సెప్టెంబర్ 28నే పార్లమెంటులో ఈ బిల్లు ఆమోదం పొందినా, ఇప్పటివరకు అది కార్యరూపం దాల్చకపోవడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. 543 పార్లమెంట్ సీట్లలో మహిళలకు 33 శాతం వాటా ఇవ్వడం బీజేపీకి ఇష్టం లేదని, వారిపై ఆ పార్టీకి గౌరవం కానీ, సానుకూల దృక్పథం కానీ లేదని ధ్వజమెత్తారు. బీజేపీ నేతలు కేవలం ఎన్నికల ప్రయోజనాల కోసమే ఆలోచిస్తారని, మహిళా సాధికారతపై వారికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. మహిళా బిల్లు అమలుపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే, డీలిమిటేషన్‌తో ముడిపెట్టకుండా వెంటనే అమలు చేయాలని పాండుగౌడ్ డిమాండ్ చేశారు. డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా బిల్లును ప్రవేశపెడితే ప్రతిపక్షాలన్నీ బేషరతుగా మద్దతు ఇస్తాయని స్పష్టం చేశారు. అయితే డీలిమిటేషన్ ముసుగులో దక్షిణాది రాష్ట్రాలపై రాజకీయ ఆధిపత్యం చెలాయించాలని, ఇక్కడి ప్రాధాన్యతను తగ్గించి తీవ్ర అన్యాయం చేయాలని బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. డీలిమిటేషన్ పేరును సాకుగా చూపి మహిళా బిల్లును అడ్డుకోవాలని చూడటం బీజేపీ నక్కజిత్తుల తెలివితేటలకు నిదర్శనమని, ఈ విషయాన్ని దేశంలోని మహిళలందరూ గమనిస్తున్నారని హెచ్చరించారు. బీజేపీలో మహిళలకు ఎక్కడైనా సముచిత స్థానం ఉందా అని ఆయన ప్రశ్నించారు. బీజేపీ ఆడుతున్న ఈ నాటకాలను, చేస్తున్న కుట్రలను ప్రజలకు పూర్తిస్థాయిలో విడమర్చి చెప్తామని, ఈ ప్రజా ప్రభుత్వంలో వారి అబద్ధాలను సాగనివ్వబోమని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని వేషాలు వేసినా, మహిళా లోకం వారిని ఎప్పటికీ క్షమించదని పాండుగౌడ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## అమ్మవారి విగ్రహం చోరీ వెనుక కుట్ర కోణంపై విచారణ జరపాలి

- **మర్రి పురురవ రెడ్డి డిమాండ్**

**సికింద్రాబాద్, ఏప్రిల్ 20 (ప్రజా స్వరం):**



సనత్ నగర్ నియోజకవర్గం బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని న్యూ బోయిగూడ ఐడీహెచ్ కాలనీ సమీపంలో ఉన్న పార్థివాడలో అమ్మవారి విగ్రహం చోరీకి గురైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. శ్రీ కట్ట మైసమ్మ, శ్రీ ఉప్పలమ్మ, శ్రీ అడవి మైసమ్మ దేవాలయాలు ఉన్న ఈ ప్రాంతంలో, సోమవారం తెల్లవారుజామున దుండగులు శ్రీ అడవి మైసమ్మ విగ్రహాన్ని ఎత్తుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర యువ నాయకులు మర్రి పురురవ రెడ్డి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఆలయాన్ని సందర్శించారు. స్థానిక పార్థి నాయకుల నుంచి ఘటనకు సంబంధించిన వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడున్న పోలీసు ఉన్నతాధికారులతో పురురవ రెడ్డి మాట్లాడుతూ.. నగరంలో ఇటీవల వరుసగా ఆలయాలపై జరుగుతున్న దాడులు భక్తులలో ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఘటన కేవలం దొంగతనమేనా లేక దీని వెనుక ఏదైనా లోతైన కుట్ర కోణం దాగి ఉందా అనే అంశంపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. నిందితులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. అలాగే గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ పెట్రోలింగ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్న విమర్శలు వస్తున్నాయని, పోలీసులు తమ పనితీరును మెరుగుపరుచుకుని భద్రతను కట్టుదిట్టం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా అంటూ నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి దేవాలయాలపై దాడులు పెరగడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇలాంటి ఘటనలపై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రకటన చేయాలని, కుట్రదారులను బయటకు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రాంమాంచ మహేష్, బీజేపీ నాయకులు అంగముత్తు శ్రీనివాస్, వై. సురేష్ కుమార్, ఎస్. రాజు, గుంటి సత్యనారాయణ, సగత్ వాళ్ళ వంశీ, చంద్రపాల్ రెడ్డి, కె. నరేష్, గోపి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# అకాల వర్షం.. నెల రాలిన పంట.. కన్నీంటి పర్యంతం అయిన రైతులు..

**ప్రజా స్వరం నార్సింగి ఏప్రిల్ 20**

నార్సింగి మండలంలో ఆదివారం సాయంత్ర కురిసిన వడగళ్ల వాన, అకాల వర్షం వల్ల పెద్ద ఎత్తున పంట నష్టం జరిగింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట పై కోతల సమయంలో ప్రకృతి కన్నెర్ర చేయడం తో రైతుల కళ్ళలో కన్నీరును మిగిల్చింది. అయ్యా ! మీ కాళ్ళు మొక్కుతాం, మమ్మల్ని ఆదుకోవాలి అంటూ రైతులు వచ్చిన ప్రతీ అధికారి, నాయకుల కాళ్ల పై పడి కన్నీరు పెడుతూ మొర పెట్టుకున్నారు. మరో రెండు రోజుల్లో ధాన్యం కోసే సమయంలో ప్రకృతి రైతుల పై పగ పట్టినట్లు, అంది వచ్చిన పంట పూర్తిగా నేలమట్టం కావడంతో రైతుల కన్నీటిని ఎవరూ ఆపలేక పోతున్నారు. మమ్ములను ఆదుకునేది ఎవరు అంటూ, నష్ట పరిహారం ఇప్పించేందుకు అధికారులు ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని అధికారులు, నాయకులకు వేడుకున్నారు. ఇదిలా ఉండగా మండల పరిధి లోని నార్సింగి, వల్లభాపూర్ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పర్యటించి నష్ట పోయిన పంటలను పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడుతూ అధైర్య పడవద్దని మనోధైర్యాన్ని కల్పించారు. చెరుకు ఇంకా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని, ప్రజల బాధ తెలిసిన ప్రభుత్వం అని అన్నారు. సంబంధిత మంత్రి తో మాట్లాడి రైతులకు నష్టపరిహారం ఖచ్చితంగా అందేలా కృషి చేస్తానని, రైతులు ఆందోళన చెందవద్దని ఆపద వచ్చినప్పుడే ధైర్యంగా ఉండాలని సూచించారు. రైతులకు పొలాలు కౌలుకు ఇచ్చిన ఆసామీలు అకాల వర్షంతో పంటలు దెబ్బ తిన్న విషయాన్ని గ్రహించి, మానవతా దృక్పథంతో ఆలోచించి కౌలు రైతుల వద్ద కౌలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి నష్టం జరిగిన రైతుల వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపించాలని సంబంధిత







## వడగండ్ల వానకు నష్టపోయిన పంటలను పరిశీలించిన ఎంపీ రఘునందన్ రావు..

- **ఫసల్ బీమా యోజన పథకం అమలు చేయాలని ఎంపీ డిమాండ్..**
- **రైతు కన్నీరు తుడిచిన ఎంపీ..**

**ప్రజా స్వరం నార్సింగి ఏప్రిల్ 20**



కేంద్ర ప్రభుత్వం ఫసల్ భీమా అమలు చేయాలని అంటున్నా రాష్ట్ర ప్రభుత్వం తన స్వంత లబ్ది కోసం పథకం అమలును అడ్డుకోవడం వల్లనే "అవ్వ పెట్టదు అడుక్కోనివ్వదు" అనే పరిస్థితి నేడు రైతుకు కలిగిందని మెదక్ ఎంపీ రఘునందన రావు విమర్శించారు. ఆదివారం మండలంలో కురిసిన వడగళ్ల వాన, భారీ వర్షం వల్ల మండలంలోని వరి రైతులు వందల ఎకరాలలో పంటను నష్ట పోయిన విషయాన్ని తెలుసుకున్న రఘునందన్ రావు సోమవారం మండల కేంద్రంలోని పంట పొలాలను సందర్శించారు. పర్యటన సందర్భంగా రైతులు కుటుంబంతో సహా ఎంపీ కాళ్ళ పై పడి తమను ఎలాగైనా ఆదుకోవాలని, లేని పక్షంలో తమకు చావే శరణ్యం అని వేడుకున్నారు. కాళ్ల మీద పడ్డ రైతులను వారిస్తూ రఘునందన్ రావు ఖచ్చితంగా ఆదుకుంటానని, ప్రభుత్వం తరపునే కాకుండా తన స్వంతంగా కూడా సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. తహసీల్దార్ గ్రేస్ బాయి, మండల వ్యవసాయ అధికారి భరత్ కుమార్ లకు రైతుల పంట నష్ట వివరాలను సరైన ఫార్మాట్ లో ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. కొందరు రైతులు తమ భూమితో పాటు మరి కొంత భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తారని, అలాంటి రైతులకు స్వంత భూమి, ఇతరుల భూమికి గల పాస్ పుస్తకాలలో ఉన్న వివరాల ప్రకారం నమోదు చేయాలని అన్నారు. రైతులు కూడా తమ పంట వివరాలను సరిగ్గా నమోదు చేసుకోవలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫసల్ భీమా అమలు చేసి ఉంటే నామ మాత్రంగా అందే 5 10 వేలు కాకుండా, పూర్తి నష్ట పరిహారం అందేదని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేలుకుని రైతుల మేలు కోసం ఫసల్ భీమాను అమలు చేయాలని ఎంపీ రఘునందన రావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు యెన్నం లింగారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు శిర్న చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు మైలారం నర్సింలు, నర్సంపల్లి గ్రామ అధ్యక్షుడు అశోక్, మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు హరి బాబు, మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్య పాల్ రెడ్డి, వార్డు సభ్యులు గజవెల్లి నవీన్, మండల బూత్ అధ్యక్షులు, వివిధ మోర్చాల నాయకులు, మైనారిటీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మెదక్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడిగా కౌడ శ్రీనివాస్ గుప్తా

- సంఘం బలోపేతానికి కృషి చేస్తా

కౌడిపల్లి ప్రజా స్వరం :-

ఆర్యవైశ్య సంఘం మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కౌడ శ్రీనివాస్ గుప్తా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం తూప్రాన్ లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు ఈ ఎన్నికలో మెదక్ జిల్లా కౌడిపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కాంగ్రెస్ పార్టీ జిల్లా యువ నాయకులు కౌడ శ్రీనివాస్ గుప్తను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అలాగే కౌడిపల్లి గ్రామానికి చెందిన ఉడుత మురళి బాలరాజు మూట్రాజ్ పల్లి సహాయ కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా ఆర్యవైశ్య ఉపాధ్యక్షులు కావున శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ తను జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ఆర్యవైశ్య సంఘానికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు ఈ సమావేశానికి కౌడిపల్లి ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఉడుత వెంకటేశం గుప్తా ఉడత రాజు గుప్తా గుప్తా , నాడ్ల వెంకటేశం గుప్తా, సిద్ధిరాములు గుప్తా, బాలకిషన్ గుప్తా,నర్సింలు గుప్త, రవీందర్ గుప్తా శ్రీనివాస్ గుప్తా, శ్రీధర్ గుప్తా, శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.




# మాతృమూర్తిని కోల్పోయిన చిన్నారులకు చిలుకూరి మహేందర్ రెడ్డి చేయూత

- తండ్రికి చెవుడు ఆ చిన్నారులకు దాతలు చేయూత కల్పించాలి

ప్రజా స్వరం గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :

జగదేవపూర్ మండలం పరిధిలోని దౌలాపూర్ గ్రామంలోని కొండాపూర్ ఉమారాణి గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా మృతురాలు ముగ్గురు చిన్నారులు మాతృమూర్తి కోల్పోయ్యారు. తండ్రికి వినికిడి లోపం.విషయం తెలుసుకున్న జిల్లా కాంగ్రెస్ యూత్ విభాగం నాయకులు మనస్సు చేలించి చిలుకూరి మహేందర్ రెడ్డి మృతురాలు కుటుంబ తండ్రిని చిన్నారులను పరామర్శించి నిత్యావసర సరుకులు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలకు నేను సైతం అండగా ఉంటూ గ్రామంలో ప్రతి పేదవాడికి అండగా ఉంటానని తెలిపారు. దాతలు ఎవరైన ఉన్నా ఆ చిన్నారులను చేయూత కల్పించి ఆదుకోవాలని అన్నారు.




# 2027 పూర్తిగా డిజిటల్ జనగణన కలెక్టర్

- ఎన్యుమరేటర్స్ సూపర్వైజర్స్ శిక్షణలో సంపూర్ణ అవగాహన
- జనగణన విజయవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

కౌడిపల్లి ప్రజా స్వరం :-

2027 డిజిటల్ జనగణన అని జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్ అన్నారు కౌడిపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్యుమరేటర్ సూపర్వైజర్లకు జనగణన2027 నిర్వహణలో భాగంగా మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ప్రతిమ సింగ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్యుమరేటర్స్ సూపర్వైజర్లుకు దిశా నిర్దేశం చేశారు. శిక్షణలో ప్రతి అంశాన్ని అవగాహన కల్పించుకోవాలన్నారు. ఈ శిక్షణ మూడు రోజులు పాటు కొనసాగుతుందని ప్రశ్నలు సమాధానాల రూపంలో జనగణన కు సంబంధించివారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో రామ కృష్ణ సంబంధిత ఎనిమరేటర్స్ సూపర్వైజర్స్, డిప్యూటీ తాసిల్దార్ జహీర్, ఆర్ ఐ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.






# చలివెంద్రాని ప్రారంభించిన సిద్దిపేట కాంగ్రెస్ అధ్యక్షులు తుంకుంటా అంక్షా రెడ్డి

- దాతలు ఇమ్మడి శివలక్ష్మి జహంగీర్
- ముఖ్య అతిథులుగా సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూముకుంట ఆంక్ష రెడ్డి, గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి

ప్రజా స్వరం గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :



జగదేవపూర్ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్ స్టాండ్ లో ఇమ్మడి శివలక్ష్మి జహంగీర్ ఆధ్వర్యంలో నూతన చలివేంద్రము ప్రారంభ కార్యక్రమాని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తుంకుంటా అంక్షా రెడ్డి గజ్వేల్ ఎఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కేశిరెడ్డి రవీందర్ రెడ్డి సర్పంచ్ పనుగట్ల శ్రీనివాస్ గౌడ్ కలిసి చలివేంద్రాని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు తుంకుంట ఆంక్షరెడ్డి గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ చలివేంద్రం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలంలో ఎండ తీవ్రత నుండి ఉపశమానం కలిగించడానికి బాటసారుల దాహార్తిని తీర్చడానికి దాతలు స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వాలు ఏర్పాటు చేసే ఉచిత మంచినీటి కేంద్రమే చలివేంద్రం. చలివేంద్రం సాధారణంగా మట్టి కుండలాల్లోని చల్లని నీరు లేదా మజ్జిగను అందస్తారు. ఇవి రద్దీ ప్రదేశాలలో బస్టాండ్ కూడళ్ళల్లో వీటిని ఏర్పాటు చేసి ప్రజల దాహర్తి తీర్చడం కోసం ఎంతో ఉపయోగం పడతాయాన్ని చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషం ఉందని అన్నారు.ఈ కార్యక్రమం లో జగదేవపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొత్త నర్సింహారెడ్డి ఉప సర్పంచ్ మచ్చ గణేష్ వార్డు నెంబర్లు బత్తిని శ్రీనివాస్ సాయి కుమార్ దండే వెంకటేష్ మల్లేశం జగదేవపూర్ మాజీ సర్పంచ్ కొత్త లక్ష్మి శ్రీనివాస్ రెడ్డి చాట్లపల్లి హనుమంత రెడ్డి కొత్త శ్రీనివాస్ రెడ్డి మాజీ వైస్ కొత్త దయాకర్ రెడ్డి మాజీ సర్పంచ్ బత్తిని మల్లేశం సయ్యద్ మునీర్, అమర రాము, అజిజ్ , కంసాని నర్సింలు, కొత్త మధుసూదన్ రెడ్డి, దండే వెంకటేష్, తాటిపాముల ఆంజనేయులు కొంపెల్లి నర్సింలు, రాగుల మల్లేశం, మిట్టపల్లి వెంకటేశం, రాచకొండ మహేష్,ఎర్ర సత్యం,సురేష్,వద్ది సాయి కుమార్,దార కరుణాకర్,దినేష్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- మినీ గురుకులంలో మధ్యాహ్న భోజనం పరిశీలన
- వసతి గృహంలో సమస్యల పరిష్కారానికి కృషి
- జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు చంద్రం కృష్ణ గౌడ్

కౌడిపల్లి ప్రజా స్వరం :-



మినీ గురుకులం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని స్థానిక సర్పంచ్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు చంద్రం కృష్ణ గౌడ్ సూచించారు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా మొదటి రోజున సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాల వంట గదులు, పరిసరాలు, పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, ఆహార నాణ్యత పై అవగాహన కింద సోమవారం మండల కేంద్రంలోని మినీ గురుకుల వసతి గృహాన్ని కౌడిపల్లి సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారుఈ సందర్భంగా కృష్ణ గౌడ్ వసతి గృహం లోని అన్ని గదులను పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు అనంతరం వసతి గృహంలో మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం బాగుందని అన్నారు ఇలాగే ప్రతిరోజు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. వసతి గృహం వంటగది పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు .

ఈ సందర్భంగా ఇన్చార్జి ప్రిన్సిపల్ ఫణి కుమార్ తో చర్చించారు హాస్టల్ సమస్యలను ముఖ్యంగా విద్యార్థులకు తాగునీటి సమస్య గూర్చి తెలపడంతో సమస్య పరిష్కరిస్తారని కృష్ణ గౌడ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో మినీ గురుకులం ఇంచార్జ్ ప్రిన్సిపల్ ఫణికుమార్ తో పాటుగా సిబ్బంది మారోని, మాధవి, శోభారాణి ,ప్రమీల, వైష్ణవి సరోజ, లలిత, కవిత ,శైలజ, మాధవి, వార్డు సభ్యులు దేవేందర్, రమేష్ నాయక్ నాయకులు సత్య నారాయణ గౌడ్, రాగుల భూమయ్య ,దర్జీ రమేష్ ,అశోక్ నాయి, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ వారోత్సవాలను విజయవంతం చేయాలి

- గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సంతోష్

సికింద్రాబాద్, ఏప్రిల్ 20 (ప్రజా స్వరం)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాలను విజయవంతం చేయాలని గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ బీ.ఎం. సంతోష్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన 99 రోజుల ప్రణాళికలో భాగంగా ఈనెల 20 నుండి 26 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ ఉత్సవాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ వారోత్సవాల్లో భాగంగా సోమవారం బోయిన్‌పల్లిలోని గిరిజన సంక్షేమ వాటర్ స్పోర్ట్స్ అకాడమీని ఆయన సందర్శించారు. సుమారు రెండు గంటల పాటు అకాడమీలోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, విద్యార్థులు మరియు ఉపాధ్యాయులతో నేరుగా మాట్లాడి అకాడమీ పనితీరుపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసిన డైరెక్టర్.. ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించారు. అకాడమీలో విద్యా ప్రమాణాలు, వసతుల కల్పన పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు దిలీప్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఆర్. కోటాజీ పాల్గొన్నారు.





EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502036. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502036,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2007/18184, CELL : 8008609999